సాక్షి జనగామ

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఆవిష్కరణల వేదిక 'మానక్'

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ అవార్డు మానక్ చక్కటి వేదికగా నిలుస్తోంది. - 8లో▸



సేవలు పరిశీలిస్తూ.. - 8లో▸

ఎంజీఎంలో వైద్యసేవలు ఎలా అందుతున్నాయి.. ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.. రోగులకు ఏమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయా అనే విషయాలను మంత్రి పొంగులేటి పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
$33^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



జనగామ: ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య జాతీయ జెండా ఎగుర వేశారు. అనంతరం స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించి, వార్డు ఆఫీసర్లు, తదితరులకు అవగాహన కల్పించారు. షెడ్యూల్ ప్రకారం కార్యాచరణను విజయవంతం చేయాలన్నారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఆమె స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ ద్వారా మొక్కలను నాటారు.

'కాంగ్రెస్ నుంచి బహిష్కరించండి'

జనగామ: ప్రజాపాలన వేడుకలను అభాసుపాలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అవమాన పరిచిన మాజీ మున్సిపల్, మార్కెట్ చైర్మన్లు ఎర్రమల్ల సుధాకర్, వేమల్ల సత్యనారాయణరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నరసింహారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, వగలబోయిన యాదగిరి గౌడ్, రాజాబోయిన లక్ష్మీనారాయణ, నూకల బాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాఫర్ షరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రామచంద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేసిన కాపీని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో కొంతమంది కాంగ్రెస్ నాయకులు అకస్మాత్తుగా వేదికపైకి వచ్చి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని వేదిక పైకి ఎందుకు పిలిచారని వాగ్వాదానికి దిగడం పార్టీకి చెడ్డ పేరు తీసుకురావడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న నాయకులను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరించాలని లేఖలో పేర్కొన్నట్లు వారు చెప్పారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



పాలకుర్తి టౌన్: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండల కేంద్రంలోని కార్మెల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు బుధవారం ప్రిన్సిపాల్ లిజ్ బెత్ తెలిపారు. ఈనెల 11న జనగామలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ ఎంపికలో పాఠశాలకు చెందిన ఆర్. అక్షయ్, జి. కౌశిక్, డి.నిత్యశ్రీ, రక్షిత ప్రతిభను కనబర్చరని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులతో పాటు పీఈటీ శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా అనంత పద్మనాభస్వామికి పూజలు



రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో వెలిసిన అనంత పద్మనాభస్వామికి మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అనంత చతుర్థిని పురస్కరించుకొని పలు జిల్లాల నుంచి అనంత పద్మనాభస్వామి పూజల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 108 మంది దంపతులు కోటి వత్తులతో దీపారాధన చేశారు. వందలాది మంది భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయ పూజారి రాజేష్ భార్గవ శాస్త్రోక్తంగా అనంత పద్మనాభస్వామి వ్రత కథ, దీపారాధన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రముఖులు హరిచంద్రప్రసాద్, పజ్జూరి జయహరి, పబ్బ సంపత్, మాడిశెట్టి సోమశేఖర్, మారం ఉపేందర్, నాగబండి రవీందర్, కిశోర్ పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పోరుగడ్డ జనగామ

వీరవనిత చాకలి అయిలమ్మ... ప్రాణార్పణ చేసిన దొడ్డి కొమురయ్య





అమర వీరులకు నివాళులర్పిస్తున్న విప్ బీర్ల ఐలయ్య. చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, కొమ్మూరి, పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తూ..



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఐలయ్య



జాతీయ జెండాకు వందనం చేస్తున్న విప్ బీర్ల ఐలయ్య

- మరో జలియన్ వాలా బాగ్ బైరాన్‌పల్లి
- దేశ్‌ముఖ్‌ను ఎదిరించిన షేక్ బందగీ
- సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శం
- ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



జనగామ: నిజాం నిరంకుశ పాలన.. తెలంగాణ సాయుధ పోరాటానికి జనగామ జిల్లా పోరుగడ్డ అని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌లతో కలిసి బీర్ల ఐలయ్య అమర వీరుల స్థూపం వద్ద అంజలి ఘటించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఎగుర వేసిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ వీరవనిత చాకలి అయిలమ్మ నిజాంపై దండయాత్ర చేస్తూ, కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో కోర్టులో విజయం సాధించి సాయుధ పోరాటానికి ఊపిరి పోసిందన్నారు. ఈ పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన ఉద్యమ వీరులు దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ, నల్లా నర్సింహులు, జనగామ బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమన్నారు. నిజాం నిరంకుశత్వంపై తెగించి పోరాడిన బైరాన్‌పల్లి, ఖిలాషాపూర్, కూటిగల్, తొర్రూరు, అమ్మాపూర్ గ్రామాలు నిజాం నిరంకుశత్వానికి బలైనవే అని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ

ప్రజా పాలన వేడుకలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సాక్షిగా కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ బయటపడింది. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్సెస్ పలువురు సీనియర్ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా పాలన వేడుకలకు విప్‌తో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి హాజరయ్యారు. విప్‌తో పాటు ప్రతాప్‌రెడ్డి కూడా వేదికపై ఆసీనులయ్యారు. ఇదే సమయంలో జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ వేదికపైకి వెళ్లి డీసీసీ అధ్యక్షుడు ఏ అధికార హోదాతో వేదిక పైకి వచ్చారని అడిగారు. దీంతో స్టేజీ కింద ఉన్న కొమ్మూరి వర్గీయులు, అసమ్మతి వాదులు పెద్ద పెట్టున నినాదాలు చేసుకున్నారు. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వేదికపై నుంచి దిగి రాగా.. ఇద్దరు అసమ్మతి వాదులను సైతం పోలీసులు కిందకు దింపారు. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చినా... ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నామా అనే ఫీలింగ్‌లో బతుకుతున్నామంటున్నారు పార్టీ శ్రేణులు. కాగా ప్రజాపాలన వేడుకలో జరిగిన గొడవ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి తన వర్గీయులను శాంతింప జేయడంతో సద్దుమణిగింది.



అసమ్మతి నాయకులను వేదిక నుంచి పంపిస్తున్న పోలీసులు

పాలన పరుగులు

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి కల్పన, అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఐటి నుంచి వ్యవసాయం వరకు అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తూ, అనతికాలంలోనే రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే అభయహస్తం హామీని అమలు చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,02,71,000 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. పేదంటి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేందుకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే 78 వేల మంది వినియోగదారులకు 1.28లక్షల గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. గృహజ్యోతి స్కీంలో 200 యూనిట్లలోపు 85,796 మంది వినియోగదారులకు రూ.13.64కోట్ల జీరో బిల్లు జారీ చేశామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజా పాలన వేడుకల్లో మైత్రేయ కళా క్షేత్రం జనగామ చిన్నారులు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ధర్మకంచ జెడ్పీహెచ్ఎస్, పెంబర్తి మహాత్మాజ్యోతిబా పూలే గురుకులం బాలికలు దేశభక్తిని చాటుకునే విధంగా నృత్యం చేసి ప్రతీ ఒక్కరిచే శభాష్ అనిపించుకున్నారు. అనంతరం తరిగొప్పుల మండలానికి చెందిన జాటోతు వీరయ్య ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించగా బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల చేతుల మీదుగా అందించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో వేడుకలను ముగించారు.

పీఎంఏవైతో నిరుపేదలకు ఇళ్లు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు

జనగామ: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)-అర్బన్ 2.0 కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలులో స్థానిక, రెవెన్యూ అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి వీసీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లతో రూ.కోటి పట్టణ గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా నిలిచేందుకే పీఎంఏవై పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ వీసీలో హౌసింగ్ ఈఈ దామోదర్ రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పీడీ హర్షవర్ధన్, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్‌డీఓ వసంత

జనగామ రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యతని ప్రజలు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీఓ వసంత అన్నారు. మంగళవారం పచ్చదనం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెంబర్తి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఖాళీ స్థలాలు, ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యంగా ఉంటేనే ప్రకృతి విపత్తు రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వరూప, జెడ్పీ సీఈఓ సరిత, అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ సంపత్‌కుమార్ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయించాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, సికార్ ఎంపీ అమ్రారాం
- పట్టణంలో శౌర్యయాత్ర ముగింపు సభ
- క్రిస్టన్ బంగ్లా నుంచి గెస్ట్ హౌస్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అమ్రారాం

జనగామ రూరల్: వీర తెలంగాణ సాయుధ విప్లవ పోరాట స్ఫూర్తితోనే దేశంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను పార్లమెంటులో రద్దు చేయించగలిగామని రాజస్థాన్ రాష్ట్రంలోని సికార్ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, రైతు ఉద్యమ నేత అమ్రారాం అన్నారు. వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాట వక్షోత్సవాల ముగింపు బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డను చూసి హృదయం పులకించిపోయిందని కొనియాడారు. రైతాంగ పోరాటాలు విద్యార్థి యువజన మహిళా శ్రామిక పోరాటాలు జరిగిన గడ్డ రాజస్థాన్ సికార్‌లో బీజేపీని ఓడించి ఇక్కడికి వచ్చానన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర సీనియర్ నాయకులు గంగసాని రఘుపాల్, ఎం.శోభన్ నాయక్, పుప్పాల శ్రీకాంత్, యాటల సోమన్న, రాపర్తి రాజు, సోమయ్య, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్ బోట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి, ప్రకాష్, విజేందర్, చందు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ డాక్టర్ రవీంద్రనాయక్



వైద్యులకు సూచనలు ఇస్తున్న రవీంద్రనాయక్

రఘునాథపల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు, మందుల స్టాక్ వివరాలు, వార్డు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాలు, గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలు, తదితర అంశాలపై వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ నెలలో ఆరు ప్రసవాలు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో వైద్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వైద్యాధికారులు సుధీర్‌కుమార్, స్వర్ణలత, మల్లికార్జున్, కమల్‌హాసన్, ప్రభాకర్, రమాదేవి, సాంబయ్య, రామ్‌కిషన్, శ్యాంసుందర్, సులోచన పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయం తనిఖీ

జనగామ: సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయాన్ని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్రనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరు శాతంతో పాటు జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, మందుల షాపుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉందనే దానిపై ఆరా తీశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, ఇతర ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి కనీసం పట్టించుకోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ. 5 వేల పెన్షన్ అందించాలన్నారు. ఉపాధి పనులు 200 రోజులకు పెంచి అందుకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల కుమార్, రాజు, రజిత, మల్లేషం, సుధాకర్, బుచ్చయ్య, సరస్వతి, లక్ష్మి, తోట రమేష్, రాజు, యాదగిరి, అంజయ్య, పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాజారెడ్డి తదితరులు

జనగామ రూరల్/పాలకుర్తి/దేవరుప్పుల: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, తెలంగాణ విలీనం దినోత్సవంపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో చిట్యాల ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ సాయుధ పోరాటం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, ఎం.జనార్దన్, చెల్లోజు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట సర్వ హక్కులు సీపీఐకే..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సర్వ హక్కులు సీపీఐకే దక్కుతాయని, దానికి పేటెంట్ తామేనని, ఎర్రజెండా నీడలోనే సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని తెలంగాణ పులి నల్ల నర్సింహులు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని, నైజాం మూకలు చెలరేగి ప్రజల్ని చిత్రహింసలకు గురి చేసేవారన్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రమహాసభ ఏర్పడి విరోచిత పోరాటాలు చేస్తూ 10 లక్షల ఎకరాల భూముల్ని ప్రజలకు పంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్,ఆది సాయన్న, జిల్లా నాయకులు ఎం జనార్దన్, చొప్పరి సోమయ్య, మోతె శ్రీశైలం చామకూర యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరును వక్రీకరిస్తే గుణపాఠం తప్పదు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవికత చరిత్రాత్మక ఉద్యమాన్ని వక్రీకరించే రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 76వ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని చేరుకున్న జీపుజాత బృందంతో ఆయన కామారెడ్డిగూడెంలో షెక్ బందగీ, ధర్మాపురంలో జాటోతు ఠాణునాయక్ స్మారక స్థూపాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లా నర్సింహ్మలు, చాకలి ఐలమ్మ, జాటోతు ఠాణునాయక్ నాయకత్వంలో కొనసాగిన మహత్తర రైతాంగ సాయుధ పోరాటం చిరస్మరణీయంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా నీర్మాల, సీతారాంపురం సీపీఎం నాయకులు అబ్బాస్, ఓడపల్లి అంజయ్యలు సీపీఐలో చేరారు. ఈ కార్యక్రమంలో జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, జీడి ఎల్లయ్య, అరుణక్క, జిల్లా నాయకులు తిరుపతి రెడ్డి, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టండి



సాక్షి ఎఫెక్ట్

సాక్షి కటింగ్‌తో సీఎంకు వినతి

జనగామ: జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ అమ్మ ఫౌండేషన్ అధ్యక్ష, గౌరవ సలహాదారులు మంతెన మణి, వంగ భీమ్ రాజు ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఎక్స్‌లో విన్నపం చేశారు. పురాతన కాలం నాటి గ్రంథాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదాలు జరుగుతున్నా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని అందులో పేర్కొన్నారు. ఇటీవల స్లాబ్ పెచ్చులూడిన సమయంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. పోటీ పరీక్షలతో పాటు వివిధ పుస్తకాలు, దినపత్రికలను చదువుతూ జ్ఞానం పెంచుకునేందుకు వచ్చే పాఠకుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మాణం చేయాలన్నారు.

ఆరోగ్య మిత్రల సమ్మె సైరన్

- నేటి నుంచి నిలిచిపోనున్న సేవలు

జనగామ: రాజీవ్ ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నేటి (బుధవారం)నుంచి నిరవధిక సమ్మెబాట పట్టనున్నారు. గత నెల 6వ తేదీన ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ డీఆర్.రమేష్ కుమార్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామకృష్ణ, జీఎం అకౌంటెంట్ కార్తీకర్‌రెడ్డిలకు 14 రోజుల గడువు విధిస్తూ సమ్మె నోటీసు ఇచ్చారు. ఉద్యోగులతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో సమ్మెకు తాత్కాలిక బ్రేక్ వేయగా, ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాక పోవడంతో సమ్మెకు తప్పడం లేదని ఆరోగ్య మిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మయ్య తెలిపారు. హెల్త్ స్కీం సమాచారం 104 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. పేద కుటుంబాలకు వైద్య సేవల పరంగా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను అందుబాటులోకి తీసుకు రాగా, తర్వాతి ప్రభుత్వాలు ఈ పథకాన్ని కొనసాగిస్తున్నాయి. జనగామ జిల్లాలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఎంసీహెచ్, నాలుగు సీహెచ్‌సీలు బచ్చన్నపేట, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు ఎస్ఎస్‌కె, ఎస్‌కేఎల్ఎస్ఎస్, ఉడుముల, అజంతా మొత్తం పది ఆస్పత్రుల పరిధిలో ఈ సేవలు కొనసాగుతున్నాయి. జిల్లాలో పది మంది ఆరోగ్య మిత్రలు ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్, జర్నలిస్ట్ హెల్త్ స్కీంలకు సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. దీంతో జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచి పోనున్నాయి.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు

జనగామ రూరల్: డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ముగ్గురు మహిళా విజేతలను మంగళవారం ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. మొదటి విజేతగా పి.శేయ భవాని, రెండో విజేత స్వాతి, మూడో విజేత ఎ.అనితకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎస్. స్వాతి మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా తీయబడుతుందని, డీలక్స్ బస్సులో ప్రయాణం అనంతరం దిగేటప్పుడు టికెట్‌పై పేరు, గ్రామం, సెల్ నంబర్ రాసి బాక్స్‌లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.దయామణిరావు, యాకయ్య, రాజు రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు ఆత్మహత్యాయత్నం

- భూ వివాదమే కారణమని ఆరోపణ

మహబూబాబాద్ రూరల్ : పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలంలోని తూర్పు తండాలో జరిగింది. బాధితుడి అల్లుడు భూక్య రామ్మూర్తి కథనం ప్రకారం.. తండాకు చెందిన అంగోత్ రాములుకు మాధవపురం గ్రామ శివారులో 3.18 ఎకరాల భూమి ఉండగా అదే గ్రామానికి చెందిన నూకల యాదగిరికి 3.09 ఎకరాలు విక్రయించాడు. మిగిలిన 9 గుంటల భూమిలో రెండేళ్లుగా వివిధ పంటలు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో రాములు అమ్మిన భూమికన్నా యాదగిరి ఎక్కువ పట్టా చేయించుకున్నాడని రామ్మూర్తి ఆరోపించారు. ఈ అంశంపై కొన్ని రోజుల నుంచి తమ భూమిని తమకు పట్టా చేయించాలని రాములు పెద్దమనుషులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే రాములు తన భూమి వద్దకు వెళ్లిన సమయంలో యాదగిరి భార్య రేణుక బంధువులు ఘర్షణ పడ్డారు. మనస్తాపానికి గురైన రాములు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతోపాటు అతడి కుమార్తె జ్యోతి కూడా శరీరంపై పెట్రోలు పోసుకుంది. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ విషయంపై రూరల్ సీఐ పి.సర్వయ్యను వివరణ కోరగా సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారు ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విషజ్వరంతో వృద్ధురాలి మృతి



సారమ్మ(ఫైల్)

టేకుమట్ల: విషజ్వరంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేనుకుంట్ల సారమ్మ(56)కు ఇటీవల జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్

వెంకటాపురం(ఎం): వెంకటాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై లైంగిక దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఈనెల 11వ తేదీన మహిళపై అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. దీంతో మహిళ కేకలు వేయడంతో పరారైనట్లు 12వ తేదీన బాధితురాలు, ఆమె కుమారుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశారు. 13వ తేదీన బాధితులు మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లైంగికదాడి యత్నం కాదని, లైంగికదాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. దీంతో బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించిన అనంతరం వైద్యపరీక్షలకు పంపించారు. 14వ తేదీన ములుగు సీఐ, వెంకటాపురం ఎస్సై .. బాధితురాలి గ్రామానికి వెళ్లి ఘటనా స్థలి వద్ద ఆధారాల కోసం సమగ్ర విచారణ చేపట్టారు. నిందితుడు పరారీలో ఉండడంతో మూడు బృందాలుగా విడిపోయి పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగలేదని వెల్లడించారు.



ఆవిష్కరణల వేదిక 'మానక్'..

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే చక్కటి కార్యక్రమం ఇన్‌స్పైర్ అవార్డు

- నామినేషన్ల దాఖలుపై ప్రైవేట్ విద్యాసంస్థల్లో అనాసక్తి
- అక్టోబర్ 15 వరకు మరోసారి గడువు పొడిగింపు
- గడువు పెంపుదలతోనైనా నామినేషన్లు పెరిగేనా
- ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ. 10వేల అవార్డు

విద్యారణ్యపురి : ఇన్‌స్పైర్ అవార్డు మానక్.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు చక్కటి వేదికగా నిలుస్తోంది. భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణల రూపకల్పనలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శాస్త్రసాంకేతిక శాఖ(డీఎస్‌టీ), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ద్వారా ఏటా ఇన్‌స్పైర్ అవార్డుల మానక్ కార్యక్రమం నిర్వహిస్తోంది. అన్ని యాజమాన్యాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కేజీబీవీ, మోడల్‌స్కూల్స్ గురుకులాలలోని 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. నూతన ప్రయోగాలు, ఆవిష్కరణలకు ప్రాజెక్టులు రూపొందించేందుకు ఇన్‌స్పైర్ అవార్డు 'మానక్' కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 2024–2025 విద్యా సంవత్సరంలో అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి ప్రాజెక్టుల రూపకల్పనకు నామినేషన్లు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై నుంచి ఇన్‌స్పైర్ అవార్డుల మానక్‌కు నామినేషన్లు చేసుకునే అవకాశం కల్పించారు. గడువు ముగియడంతో తాజాగా అధికారులు ఈఏడాది అక్టోబర్15 వరకు పొడిగించారు.

నామినేషన్ల ప్రక్రియ ఇలా

ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లకు సంబంధిత వెబ్‌సైట్ ఇన్‌స్పైర్ అవార్డ్స్.డీఎస్‌టీ.గౌట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా లేదా గూగుల్ ప్లేస్టోర్‌లో ఇన్‌స్పైర్ మానక్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని స్కూల్ అథారిటీ ద్వారా యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌తోలాగిన్ అయి విద్యార్థులు, ఆవిష్కరణల వివరాల నమోదు చేయడంతో నమోదు ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. పాఠశాలల హెచ్‌ఎంలు గైడ్ టీచర్ సహకారంతో విద్యార్థులతో ప్రాజెక్టులకు సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్లు వెబ్‌సైట్ ద్వారా పంపుతున్నారు. ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని విద్యాశాఖ అధికారులు, ప్రతి జిల్లా సైన్స్ అధికారి.. స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా సంబంధిత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు తెలిపారు. అయినా లక్ష్యం మేరకు నామినేషన్లు పూర్తికాలేదు. ఇన్‌స్పైర్ అవార్డుల మానక్‌కు



నామినేషన్లకు (దరఖాస్తుల) గడువును ఈఏడాది అక్టోబర్15 వరకు తాజాగా డీఎస్‌టీ , ఎన్‌ఐఎఫ్ పొడిగించింది. ఇప్పటికైనా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని యాజమాన్యాలు తమ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి నామినేషన్లకు ఉపక్రమించాల్సింటుంది.

ఒక్కో పాఠశాల నుంచి ఐదు నామినేషన్లకు అవకాశం

ఒక్కో పాఠశాల నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులకు 5 నామినేషన్లకు అవకాశం ఉంటుంది. కానీ ఆ మేరకు వివిధ పాఠశాలలు ఉపయోగించుకోవడం లేదు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఉదాహరణకు హనుమకొండ జిల్లాలో ఇప్పటివరకు 395 పాఠశాలల్లో 1975 ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్లకు అవకాశం ఉండగా ఇప్పటివరకు 1111 నామినేషన్లు వచ్చాయి. ఇందులో కూడా ప్రభుత్వ యాజమాన్యాల నామినేషన్లు ఎక్కువ ఉండగా ప్రైవేట్ పాఠశాలలవి తక్కువ ఉన్నాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది.

ఉమ్మడి వరంగల్‌జిల్లాలో నామినేషన్ల వివరాలు

జిల్లా	పాఠశాలలు	నామినేషన్ల లక్ష్యం	ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్లు
హనుమకొండ	395	1975	1111
వరంగల్	344	1720	1487
మహబూబాబాద్	233	1165	1033
జనగామ	195	975	632
జయశంకర్ భూపాలపల్లి	131	655	454
ములుగు	112	560	315

ఎంపికైతే ఒక్కో విద్యార్థి నామినేషన్‌కు రూ.10 వేల అవార్డు

ఇన్‌స్పైర్ అవార్డుకు ప్రాజెక్టు రూపకల్పన చేసి నామినేషన్‌ను సంబంధిత వెబ్‌సైట్‌ద్వారా పంపితే ఎంపికైన విద్యార్థికి రూ. 10 వేల చొప్పున సంబంధిత విద్యార్థికి బ్యాంకు అకౌంట్‌లో జమచేస్తారు.

ఇన్‌స్పైర్ మానక్‌కు నామినేషన్లు పంపండి



ఇన్‌స్పైర్ అవార్డు మానక్.. 6నుంచి 10వ తరగతి విద్యార్థులో నూతన ఆలోచనలు, ప్రతిభను వెలికి తీసేందుకు చక్కని వేదిక. అందుకు అన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలి. అందుకు మొదట ఒక ఐడియాతో ప్రాజెక్టుకు సంబంధించిన నూతన ఆవిష్కరణల వివరాలతో నామినేషన్లు పంపాలి. హనుమకొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి నామినేషన్లు చాలా తక్కువ వచ్చాయి. మరోసారి అక్టోబర్15 వరకు గడువు పొడిగించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి.

ఎస్. శ్రీనివాసస్వామి,
జిల్లా సైన్స్ అధికారి,హనుమకొండ

ఈ నిధులతో ఆ విద్యార్థి వినూత్న ఆవిష్కరణకు సంబంధించిన నమూనాను రూపొందించేందుకు, ప్రయాణ ఖర్చులకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డుల ప్రాజెక్టులకు సంబంధించిన నమూనాల ప్రదర్శనలు వచ్చే ఏడాది నవంబర్‌లో నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి ప్రదర్శనకు, అందులో ఆ ప్రాజెక్టు నమూనా ఎంపికైతే జాతీయ స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో ఉత్తమ కనబర్చిన విద్యార్థులను జపాన్ వంటి దేశాల పర్యటనకు కూడా ఎంపిక చేస్తారు. వారికి రూ. 25వేల పారితోషికం అందజేస్తారు.

16 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

- ముగ్గురు యువకుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డోర్నకల్ సీఐ రాజేశ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేశ్

డోర్నకల్: మండల కేంద్రంలో 16 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి. రాజేశ్ మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఒడిశాలోని గంజాం జిల్లా బుదంబా గ్రామానికి చెందిన రాంశకర్ పాట్నాయక్, ఓ బాలుడు, బదమాహారికు చెందిన టి.కుముదచంద్ర ప్రదాన్.. సమీప గ్రామానికి చెందిన సల్మాన్ వద 16.3 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. తమ ప్రాంతానికి చెందిన టిట్టు సూరత్‌లో ఉండడంతో అతడిని సంప్రదించి అక్కడ గంజాయి విక్రయించేందుకు కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు.ఈ క్రమంలో రైలులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడంతో సోమవారం సాయంత్రం డోర్నకల్ స్టేషన్‌లో దిగారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డుకు వచ్చి అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. గమనించిన ఎస్సై వంశీధర్ వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పారిపోవడానికి యత్నించగా అదుపులోకి తీసుకుని బ్యాగులు తనిఖీ చేశారు. ఇందులో 8 ప్యాకెట్లలో 16.3 కేజీల ఎండు గంజాయి లభ్యం కావడంతో ముగ్గురిని అరెస్ట్ చేశారు. గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, పట్టుకున్న గంజాయి విలువ రూ. రూ.4,08,250 ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సై వంశీధర్, సిబ్బంది సోమేశ్వర్, కోటేశ్వర్‌రావు, సైదులు, శ్రవణ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుడికి షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు కె.సదాశివ్‌కు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం షోకాజ్ నోటీస్ జారీచేశారు. సదాశివ్ తనను యూనివర్సిటీ క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ చేయాలని ఎకనామిక్స్ విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు శ్రీధర్‌కుమార్‌లోథ్‌తో కలిసి వచ్చి బెదిరించి, అమర్యాదగా మాట్లాడారని ఆరోపిస్తూ కేయూ తెలుగు విభాగం అధిపతి ఏటూరు జ్యోతి.. ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్‌కు ఈనెల 16న ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి సదాశివ్‌కు షోకాజ్ నోటీస్ జారీచేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

ఖిలా వరంగల్: ఆన్‌లైన్ సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు ఏసీపీ ఎ. మధుసూదన్ తెలిపారు. వరంగల్–నర్సంపేట రోడ్డులోని క్రిస్టియన్ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం గద్దల శ్రీలత రహస్యంగా ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో దాడి చేశారు. రూ.24,100 నగదు, ఒక స్మార్ట్‌ఫోన్, సట్టా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు. శ్రీలతను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

మానుకోటలో బయటపడిన ఆంజనేయుడి విగ్రహం



అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్ : భక్తురాలికి పూనకం వచ్చి సందర్భంలో ఆమె మాటల ఆధారంగా ఓ స్థలంలో మట్టి తీయగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహం బయటపడింది. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని మంగలికాలనీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. మంగలికాలనీలో నివాసం ఉండే లలితకు ఉదయం భక్తిపారవశ్యంలో పూనకం వచ్చింది. కేకలు వేస్తూ ఆంజనేయ స్వామి ఇక్కడ ఉన్నాడు.. వెలిశాడంటూ పూనకంతో ఊగిపోయింది. దీంతో స్థానికులు లలితను కొంత దూరం తీసుకురాగా ఆమె అదే కాలనీలోని ఒకచోట స్థలంలోని మట్టిని చిందర వందర చేసి తన చేతితో తీసింది. అంతలోనే అక్కడ స్వయంభూ అభయ ఆంజనేయ స్వామి రాతి విగ్రహం బయటపడింది. భక్తుల కోరిక మేరకు శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు గుణనిధి లక్ష్మీనారాయణచార్యులు, దత్తు అక్కడకు చేరుకుని పూజలు నిర్వహించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వైవీ.రావు, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఆర్. యాకన్న స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందిన మొదటి లిస్ట్ పరిశోధకులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ ను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య తెలిపారు. ఈఏడాది అక్టోబర్ 1వ తేదీవరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు రూ. 930 చెల్లించాలన్నారు. రూ. 250 అపరాధ రుసుంతో అక్టోబర్ 15 వరకు ఫీజు చెల్లించొచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

సేవలు పరిశీలిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ



వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ



ఎంజీఎంలో వంటలను పరిశీలిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ



ఫార్మసీ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

ఎంజీఎంను పరిశీలించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- ఎస్‌డీపీ పరికరం ప్రారంభోత్సవం.. రోడ్డు పనులకు శంకుస్థాపన
- కేఎంసీలో డయాలసిస్ యూనిట్ ప్రారంభం

ఎంజీఎం : వేలాది మంది రోగులు చికిత్స పొందే ఎంజీఎంలో వైద్యసేవలు ఎలా అందుతున్నాయి.. ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.. రోగులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయనా అనే విషయాలు తెలుసుకునేందుకు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో రక్తనిధి కేంద్రంలో రూ. 41 లక్షల వ్యయంతో అందుబాటులోకి తీసుకొచ్చిన సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ పరికరాన్ని ప్రారంభించి మరో మంత్రి కొండాసురేఖ, ఎంపీ కడియం కావ్యతో కలిసి ఆస్పత్రిలోని వార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారి తండ్రి రాజు అనే వ్యక్తి మందులను ప్రైవేట్ ఆస్పత్రిలో కొనుగోలు చేయాలని చెబుతున్నారు.. అని మంత్రికి చెప్పగా ఘటనపై వెంటనే విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఎంజీఎం సూపరింటెండెంట్ మురళిని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డును పరిశీలించి ఎలాంటి సేవలు అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా డ్యూటీ డాక్టర్లను ఆయా రోగుల సమస్యలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా, ఎంపీ కావ్య, ఎంజీఎం పరిపాలనాధికారులతో కలిసి ఆస్పత్రి స్టోర్స్‌కు వెళ్లిన మంత్రి పొంగులేటి.. తన పర్యటన ముగిసే లోగా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఔషధాల నిల్వలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

రోజూ ఉద్యోగుల అటెండెన్స్ పరిశీలిస్తాం

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ, ఎంపీ కడియం కావ్య మంగళవారం ఉదయం పర్యటించారు. వారి పర్యటన అనంతరం వరంగల్ కలెక్టర్ సత్యశారద సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో మంత్రులు పర్యటించిన సమయంలో ఇచ్చిన ఆదేశాలతో పాటు ఆస్పత్రిలో రోగుల సమస్యలపై ఎంజీఎం పరిపాలనాధికారులతో పాటు ఆయా విభాగాధిపతులతో కలెక్టర్ సత్యశారద ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించే ప్రతీ ఉద్యోగిపై చర్యలు తప్పవన్నారు. రోజూ నాలుగో తరగతి ఉద్యోగి నుంచి.. వైద్యాధికారి వరకు అటెండెన్స్‌ను పరిశీలిస్తామన్నారు. దీనికి ఓ ఆర్ఎంఓను ప్రత్యేకంగా నియమించారు. అంతే కాకుండా ఔషధాల నిల్వలపై పూర్తిస్థాయి సమాచారంతో బుధవారం కలెక్టరేట్‌కు హాజరు కావాలని ఆదేశించారు.

ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన వరంగల్ ఎంపీ కావ్య

ఎంజీఎం పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేశారు. రోగులు తమ బంధువులకు మందులు ఇవ్వడం లేదనే విషయంపై మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ స్పందించారు. ఈ క్రమంలో ఎంపీ కావ్య ఔషధ నిల్వల కేంద్రంలో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వృత్తి రీత్యా డాక్టరైన ఎంపీ కావ్య.. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి రావాల్సిన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. దాదాపు మూడు నెలల పాటు డ్రగ్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం గురించి మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలన్నారు.

పరికరాల ప్రారంభోత్సవాలు..

ఎంజీఎం ఆస్పత్రిలో రూ. 41 లక్షల సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్‌ను ప్రారంభించడంతో పాటు కాకతీయ మెడికల్ కళాశాలలో రూ. 3 కోట్ల 45 లక్షల వ్యయంతో నిర్మించే అంతర్గత రోడ్డు పనులకు వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.నాగరాజు మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 14 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించడంతో పాటు అదనంగా మరో 10 డయాలసిస్ యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్ఎంఓలు మురళీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూములు ధారాదత్తం!

- ట్రిపుల్ ఆర్ కోసం బదలాయింపు
- గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న అధికారులు
- వ్యతిరేకిస్తున్న స్థానికులు



పాగుళ్లపల్లిలో అటవీ శాఖకు అప్పగించేందుకు యత్నించే రెవెన్యూ భూమి ఇదే..

కొత్తగూడ: హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు తీసుకునేందుకు కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని 70 ఎకరాల రెవెన్యూ భూమిని అటవీ శాఖకు బదిలీ చేసేందుకు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మంతనాలు చేస్తున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమాచారం లేకుండా రెండు శాఖల అధికారులు ఇటీవల హద్దులు నిర్ణయించి పునాది వేశారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అధికారులకు తెలియకుండా హద్దులు తొలగించినట్లు సమాచారం. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో అధికారులు సందిగ్ధంలో పడినట్లు తెలిసింది.

అసలు ఏం జరుగుతుంది?

అటవీ శాఖ భూముల్లో ప్రభుత్వ కట్టడాలు చేపట్టాలంటే ఎంత భూమిపోతుందో అంతకు రెండింతల రెవెన్యూ భూమిని అటవీశాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. హైదరాబాద్ చుట్టూ నిర్మించే ట్రిపుల్ ఆర్‌లో ఫారెస్ట్ భూమి ఉన్నట్లు సమాచారం. అందులో అనుమతుల కోసం ఇక్కడి భూమి ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అందుకు రెండేళ్ల క్రితమే నివేదికలు రూపొందించినట్లు సమాచారం. అయితే కొత్తగూడ మండల అభివృద్ధికి కాకుండా ఎక్కడో జరిగే పనుల కోసం గ్రామస్తులు కాపాడుకున్న గ్రామ కంఠం భూమిని ఇవ్వడంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వస్తోంది. తహసీల్ కార్యాలయ నిర్మాణం, రైతుల సౌకర్యం కోసం గోదాంల నిర్మాణం, మండలకేంద్రంలో 30పడకల ఆస్పత్రి, ఎంజేపీ గురుకుల పాఠశాల నిర్మాణం కోసం రెవెన్యూ భూమి లేదని చెబుతున్న అధికారులు ట్రిపుల్ ఆర్‌కు ఎలా భూమి ధారాదత్తం చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా బదిలీ..

ఏజెన్సీ గ్రామాల్లో ప్రభుత్వ అధికార కార్యకలాపాలు నిర్వహించాలంటే ఇక్కడి చట్టాలకు లోబడి చేయాల్సి ఉంటుంది. భూమి బదలాయించాలంటే గ్రామ సభ 1/3 మెజారిటీ తీర్మానంతో పాటు పెసా గ్రామ కమిటీ ఆమోదం ఉండాల్సిన అవసరం ఉంటుంది. ఇవేమీ లేకుండా నేరుగా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులే ఒకరికొకరు భూమిని మార్చుకోవడంపై ఆదివాసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. భూమిని ఇక్కడి ప్రజల అభ్యున్నతి కోసమే ఉపయోగించాలని కోరుతున్నారు. ఈవిషయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకుని భూబదలాయింపు ఆపాలని కోరుతున్నారు. కాగా, ఈవిషయమై తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా పొగుళ్లపల్లి భూమి బదిలీ చేసేందుకు రూపొందించిన నివేదికలు తనకంటే ముందు ఉన్న తహసీల్దార్ సమయంలో జరిగాయన్నారు.

తల్లి చనిపోతుందనే భయంతో..

- రైలు కింద పడి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య
- ధర్మారంలో ఘటన



విజ్ఞాన్ (ఫైల్)

కాశిబుగ్గ: అనారోగ్యంతో ఉన్న తల్లి చనిపోతుందనే భయంతో కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన వరంగల్, చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం రైల్వే గేట్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారానికి చెందిన గాదే విజ్ఞాన్(32) కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి తన తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో తల్లి చనిపోతుందనే భయంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం ధర్మారం రైల్వే గేటు సమీపంలో గోదావరి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి తండ్రి గాదే పాణికి అప్పగించామని జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు.

పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఎలుకల మందు తిని యువతి..

డోర్నకల్ : పెళ్లి కావడం లేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని తొడేళ్లగూడెంలో జరిగింది. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్, ఉత్తమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఇద్దరికి వివాహమైంది. చిన్న కుమార్తె కల్యాణి(21) ఏడాది క్రితం డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో కొంతకాలంగా కల్యాణికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా వివిధ కారణాలతో కుదరడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన రాత్రి తల్లిదండ్రులతో కలిసి వినాయక పూజకు వెళ్లిన కల్యాణి అనంతరం ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించింది. తల్లి ఉత్తమ్మ తెల్లవారుజామున నిద్ర లేచి చూడగా కల్యాణి అపస్మారకస్థితిలో పడి ఉంది. ఎం జరిగిందని కల్యాణిని ప్రశ్నించింది. దీంతో తనకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని, తనకు ఇక పెళ్లి కాదనే భయంతో ఎలుకల మందు తిన్నానని తల్లికి చెప్పింది. తల్లిదండ్రులు వెంటనే ఖమ్మం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.